ప్రజాశక్తి

బుధవారం 4 డిసెంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు



తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించండి



మాట్లాడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని కొమ్మంగి పంచాయతీ రౌ రింతాడ రోడ్డు వీధి గ్రామంలో తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని ఆ గ్రామస్తులు కొర్ర బుచ్చబాబు, మఠం పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ, రౌ రింతాడ రోడ్డు వీధి గ్రామం ఏర్పడి సుమారు 15 ఏళ్లు కావస్తున్నప్పటికీ తమ గ్రామానికి కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించలేదన్నారు. గత ప్రభుత్వంలోనూ ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరగడమే గాక అర్జీలు పెట్టడం జరిగిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనైనా తాము ఎదుర్కొంటున్న తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు.

గిరిజనం గొంతుక సిపిఎం

- ఆదివాసీ చట్టాలు, హక్కుల రక్షణకు నిరంతర పోరాటం - ఎన్నో స్ఫూర్తిదాయక విజయాలు



ఆదివాసీ జనరక్షణ దీక్షలో సిపిఎం నాయకులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు మన్యంలో గిరిజన, రైతు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువత గొంతుకగా సిపిఎం నిలుస్తోంది. వారి అభ్యున్నతికి, గిరిజన చట్టాల రక్షణకు, హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తోంది. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం విశేష కృషి చేస్తోంది. స్ఫూర్తిదాయక విజయాలను సాధించింది. ఈ క్రమంలోనే భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించుకునేందుకు ఆ పార్టీ ప్రథమ మహాసభలకు సిద్ధమైంది. జిల్లా కేంద్రం పాడేరులో బుధ, గురువారాల్లో జరిగే పార్టీ మహాసభకు 500 మంది ప్రతినిధులు తరలిరానున్నారు. ఈ క్రమంలో గడిచిన కాలంలో సిపిఎం చేసిన పోరాటాలను గుర్తుచేస్తూ సాగేదే ఈ కథనం.



జిఒ నెంబర్ 3 చట్టబద్ధతకై పోరాటం

షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన యువతకు నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలని పాడేరు ఏజెన్సీలో సుదీర్ఘకాలంగా సిపిఎం పోరాటం సాగిస్తోంది 2020 మార్చి 24న సుప్రీం కోర్టు జిఒ నెంబర్ 3ని రద్దు చేసింది. 30 ఏళ్లుగా గిరిజనులు ఈ జిఒ నెంబర్ 3 ద్వారా 19 శాఖల్లో 30 రకాల కేటగిరీల్లో రిజర్వేషన్ సౌకర్యంతో ఉద్యోగ అవకాశాలు పొందారు. జిఒ నెంబర్ 3 రద్దుతో గిరిజనులకు జరిగిన నష్టం, అన్యాయంపై సిపిఎం సుదీర్ఘ పోరాటం సాగిస్తోంది.

1/ 70 చట్టం పటిష్ట అమలుకు..

అల్లూరి జిల్లా ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలుచేసి గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలను, అక్రమ క్వారీలను అరికట్టాలని, నల్లరాయి గ్రానైట్ వంటి తవ్వకాలను నియంత్రించాలని, గిరిజనుల సాగు భూములను పరిరక్షించాలని సిపిఎం నిరంతర పోరాటాలు నిర్వహిస్తోంది. నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను, షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లోకి చేర్చి గిరిజనుల భూములు, అడవులకు రక్షణ కల్పించాలని, మైనింగ్ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలని కోరుతోంది. ఆదివాసీల సంపద, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోంది. గిరిజన చట్టాలకు విరుద్ధంగా హైడ్రో ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని ఉద్యమిస్తోంది. హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణం గిరిజనుల జీవన మనుగడకు విఘాతమని సిపిఎం తొలి నుంచీ చెబుతోంది.

పివిటిజి గ్రామాల అభివృద్ధికి పోరాటం

అల్లూరి జిల్లాలో అభివృద్ధికి దూరంగా ఉన్న పివిటిజి గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు పెంపొందించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం గిరిజనులను చైతన్యపరిచి పలు పోరాటాలు నిర్వహించింది. వందలాది గ్రామాలకు తాగునీరు, రోడ్లు, రవాణా, కమ్యూనికేషన్, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు అందించాలని ఉద్యమించింది. పర్వత శిఖరాలపై ఉండే పివిటిజి గ్రామాల గిరిజనులు వైద్యం కోసం ఎంతలా ఇబ్బందులు పడుతున్నారో బాహ్య ప్రపంచానికి తెలియజేసింది. డోలీమోతలతో అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పోరాటాలు సాగించి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లింది. పివిటిజిలకు అంత్యోదయ కార్డులను పునరుద్ధరించాలని, రహదారులు, వంతెనలు, గృహాలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, పాఠశాలలు, అంగన్వాడీ భవనాలు నిర్మించాలని, పివిటిజి గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించి అభివృద్ధి చేయాలని పోరాటాలు నిర్వహించింది.

స్కీం వర్కర్ల సమస్యలపై ఉద్యమం

ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై అనేక పోరాటాలను సిపిఎం నడిపింది. ఆయా రంగాలవారికి ఊతమిచ్చి సమస్యల పరిష్కారానికి బాసటగా నిలిచింది. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని పోరాడింది. గిరిజన రైతులకు కాఫీతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, బకాయి ప్రోత్సాహకాలు మంజూరు చేయాలని పోరాటాలు చేసి అధికార యంత్రాంగాన్ని కదిలించింది.

పాడేరులో ఆదివాసీ జనరక్షణ దీక్షలు

ఈ ఏడాది ఎన్నికల ముందు ఆదివాసీ సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరుతూ పాడేరు ఐటిడిఎ ఎదురుగా ఆదివాసీ జన రక్షణ దీక్షలను సిపిఎం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ, నిరుద్యోగ జెఎసిలు చేపట్టిన మార్చి 10 ఏజెన్సీ బంద్‌కు విశేష స్పందన లభించింది. నిరుద్యోగం, నిర్వాసితులు, ఇతర భూసమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో మార్చి 8, 9 తేదీల్లో జరిగిన ఈ ఆదివాసీ జనరక్షణ దీక్షలు అధికార యంత్రాంగంలోనూ, విపక్షాలలో సైతం కదలిక తెచ్చాయి. ఈ విధంగా సిపిఎం చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవి. ఉత్తేజపూరితమైనవి.



ఎర్రజెండాలు, తోరణాలతో ముస్తాబయిన అంబేద్కర్ సెంటర్

మహాసభకు వేళాయె..

- -నేడు, రేపు సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ
- -ఉదయం 10 గంటలకు పాడేరులో భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ
- -ముఖ్య అతిథిగా హాజరుకానున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- -కాఫీ హౌస్‌లో ప్రతినిధుల సభ
- -ఏర్పాట్లు పూర్తి - ఎర్రజెండాలు, తోరణాలతో పాడేరు ముస్తాబు

ప్రజాశక్తి - పాడేరు : ఈ నెల 4, 5 తేదీల్లో జరిగే సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభకు జిల్లా కేంద్రం పాడేరు ముస్తాబైంది. పట్టణంలో ఎక్కడ చూసినా ఎర్ర జెండాలు, తోరణాలే దర్శనమిస్తున్నాయి. మహాసభలను ఘనంగా నిర్వహించేందుకు పార్టీ కార్యకర్తలు సమాయత్తమయ్యారు. మంగళవారానికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి రోజు బుధవారం 10 గంటలకు పాడేరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పాత పాడేరు గ్రామ చావడి పక్కన ఉన్న ప్రాంగణంలో బహిరంగ సభ ఉంటుంది. ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరై ప్రసంగించనున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.హైమావతి, పాడేరు మండల కార్యదర్శి ఎల్.సుందరరావు, మండల కమిటీ సభ్యులు పాలికి లక్కు మాట్లాడనున్నారు. అనంతరం కాఫీ హౌస్‌లో ప్రతినిధుల సభ జరుగనుంది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 500 మంది ప్రతినిధులుగా హాజరుకానున్నారు. స్థానిక కాఫీ హౌస్‌లో సీతారాం ఏచూరి ప్రాంగణంలో ఈ ప్రతినిధుల సభ ఉంటుంది.

మహాసభను జయప్రదం చేయండి : జిల్లా కార్యదర్శి అప్పలనర్స

సామాన్య, పేద ప్రజల బాగు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిజాయితీగా, నిస్వార్థంగా పాటుపడుతున్న సిపిఎం పాడేరులో నిర్వహిస్తున్న జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. పివిటిజి తెగల గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేయాలని, కాఫీ రైతులకు గిట్టుబాటు ధర పెంచాలని, జిఒ నెంబర్ 3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలని, మాతృభాష వాలంటీర్లను, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి, వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం బుధవారం జరిగే బహిరంగ సభను, ర్యాలీని విజయవంతం చేసి భవిష్యత్తు ఉద్యమానికి నాంది పలకాలని ఆదివాసీలను ఆయన కోరారు.

రహదారి లేక తప్పని డోలీ మోతలు

ఐదు కిలోమీటర్లు మోసుకొచ్చిన బంధువులు

ప్రజాశక్తి-కొయ్యూరు

గిరిజన గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యాలు లేకపోవడంతో అనారోగ్యానికి గురైనప్పుడు, గర్భిణుల ప్రసవ సమయంలోనూ గోలీమోతలు తప్పడం లేదు. కొయ్యూరు మండలం, డౌనూరు పంచాయతీ పరిధి ఉసిరికపాడు గ్రామంలో వంతల లక్ష్మి అనే గర్భిణికి మంగళవారం పురిటినొప్పులు రావడంతో గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆమె భర్త వంతల భాస్కరరావు, కుటుంబ సభ్యులు, ఆశా వర్కర్‌తో కలిసి డోలీ కట్టి 5 కిలోమీటర్ల దూరం వరకు మోసుకొని తీసుకొచ్చారు. గుమ్మడిమానుపాలెంలో అంబులెన్స్ ఎక్కించి డౌనూరు పిహెచ్‌సికి తరలించారు. ఈ సమయంలో గర్భిణి నరకయాతన అనుభవించింది. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్ వచ్చే అవకాశం లేక డోలీ మోతగా తీసుకురావాల్సి వచ్చింది. ఉసిరికపాడు గ్రామానికి గతంలో కోటి 63 లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్డు మంజూరైంది. కాంట్రాక్టర్ అసంపూర్ణంగా రోడ్డు నిర్మాణం చేసి వదిలేశారు. దీంతో ఉన దారి కూడా అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ఈ గ్రామ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.



గర్భిణిని డోలీలో మోసుకొస్తున్న కుటుంబ సభ్యులు

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం హెచ్చరించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని రాజవొమ్మంగి, వై.రామవరం, గంగవరం ప్రభుత్వ ఆస్పత్రులను మంగళవారం ఐటిడిఎ పిఒ ఆకస్మిక తనిఖీ చేశారు. పిహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాజవొమ్మంగి మండలంలోని జడ్డంగి పిహెచ్‌సి పరిధిలో ఉర్లాకులపాడు గ్రామానికి చెందిన గర్భిణి గత నెల 30న మృతి చెందిన సంఘటనపై ఆరా తీశారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎప్పటికప్పుడు అన్ని రకాలైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు సంబంధించి ఉచితంగా మందులు అందజేయాలని ఆదేశించారు. వై.రామవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి అక్కడ వైద్యులు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ, అసిస్టెంట్ కలెక్టర్ భావన బీపీ, షుగర్ టెస్టులు చేయించుకున్నారు. అనంతరం వైరామవరం మండలం పి.ఎర్రగొండ గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ భవన పనులు, సిబ్బంది క్వాటర్స్ నిర్మాణ పనులు పరిశీలించారు. భవన నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వై.రామవరం బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించి విద్యా బోధనను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని, గంగవరం మండలం కొత్తాడ గ్రామంలో గోకులం షెడ్‌ను పీఓ, అసిస్టెంట్ కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు, ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, భైరవ, పిహెచ్‌సి వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

చిన్నయ్య పడాల్‌కు మాతృవియోగం



చిన్నమ్మి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-చింతపల్లి: తాజంగి పంచాయితీ వంతమామిడిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ తల్లి బోనంగి చిన్నమ్మి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. చిన్నమ్మి భౌతిక కాయానికి సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేంద్ర, జిల్లా కార్యదర్శి అప్పలనర్స, జడ్పిటిసి దిసరి గంగరాజులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో బిజెపి నాయకుడు బోనంగి బాలయ్య పడాల్, సిపిఎం మండల కార్యదర్శి, పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, జి.సత్యనారాయణ, గాలికొండ ఎంపిటీసీ బుజ్జి బాబు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు బేరా సత్యనారాయణ పడాల్, బోనంగి బెన లింగేశ్వరరావు, వైసిపి ఎంపిటిసి కృష్ణమూర్తి, టిడిపి నాయకులు నూకరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, కార్తీక్, జీవన్ కృష్ణ ఉన్నారు.

చిన్నమ్మి మృతికి సంతాపం

సీలేరు: సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాతృమూర్తి చిన్నమ్మి మృతికి సిఐటియు సీలేరు గౌరవ అధ్యక్షులు ఎస్కే.సుభాన్, బ్రాంచ్ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. చిన్నయ్యపడాల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

12 మంది ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయానుబంధ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుండి వ్యవసాయ, ఉద్యానవన, ఐసిడిఎస్, ఉపాధిహామీ, పశు సంవర్ధక శాఖ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలు అమలుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 64 వేల ఉపాధి హామీ జాబ్ కార్డుదారులకు వందరోజుల పని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని స్పష్టం చేసారు. ప్రతీ మండలంలోను 100 ఫారం పాండ్స్ నిర్మాణాలు ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఫారంపాండ్స్ వెడల్పు, లోతులను, ఎంత నీరు పడుతుందని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఉపాధి హామీ పనులపై ఎంపిడి ఓలు దృష్టి పెట్టాలన్నారు. లక్ష్యాలు సాధించలేని ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బరువు తక్కువ, పోషకాహారం లోపంతో ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. రైతులకు పి. ఎం. కిసాన్ పథకం అందించడానికి ఇ.కె. వైసీ, ఆధార్ అను సంధానం ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. 982 మందికి ఆధార్ లింకింగ్ చేయాల్సి ఉందని ఆధార్ లింకింగ్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశించారు.

27567 మంది లబ్దిదారులను నేషనల్ పేమెంట్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్‌లో నమోదు చేయలేదని 12 మంది ఎంపిడి ఓలకు సోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చింతపల్లి, పెదబయలు, వై.రామవరం, కూనవరం, అనంతగిరి, మారేడిమిల్లి, డుంబ్రిగుడ, రంపచోడవరం, ఎటపాక, వి. ఆర్.పురం, ముంచంగిపుట్టు, జి.మాడుగుల ఎంపిడి ఓలకు షోకాజ్ నోటీసులు చేస్తామన్నారు. వెబ్ సైట్లో లబ్దిదారుల వివరాలను నమోదు చేయకపోవడం, బ్యాంకు ఖాతాల ప్రారంభించక పోవడంతో నగదు బదిలీ పథకాలను లబ్దిదారులు నష్టపోతారని ఎంపిడిఓలపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పి.ఓ అభిషేక్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్ .నంద్, ఐటిడి ఏస్ పి.డి. ఎన్. సూర్యలక్ష్మి, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, పశు సంవర్ధక శాఖ డిడి నరసింహులు జిల్లా పంచాయతీ అధికారి బి. లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, సెరీ కల్చర్ ఎడి అప్పారావు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడే గోపిమూర్తిని గెలిపించాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యా రంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఉపాధ్యాయ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.గోపిమూర్తిని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. గోపిమూర్తిని శాసనమండలికి పంపిస్తే ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సమస్యల సాధనకు కృషి చేస్తారని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటు పడతారని, ప్రజా ఉద్యమాల వాణిని మండలిలో వినిపిస్తారని పేర్కొన్నారు. నిజాయితీగా, అభ్యుదయ విలువలకు కట్టుబడి, చిత్తశుద్ధిగా ప్రజాపక్షం వహిస్తారన్నారు. పూర్వ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ ఆశయ సాధనకు కట్టుబడి పని చేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు కె.కృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, పలువురు యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం!

- -దోనెలపాలెంలో రెండు మేకలపై దాడి
- -ఆందోళన చెందుతున్న గ్రామస్తులు
- -దర్యాప్తు ముమ్మరం చేసిన ఫారెస్ట్ అధికారులు



పులి దాడిలో మృతి చెందిన మేక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని గడువకుర్తి పంచాయతీ దోనెలపాలెం, బొబ్బిలిమడుగు గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం నుండి చిరుత పులి సంచరిస్తున్నట్లు ఆ గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెండు మేకలపై దాడి చేయగా, ఒక మేక చనిపోగా, మరో మేకను పులి ఎత్తుకుపోయిందంటూ గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాజవొమ్మంగి అటవీ శాఖ రేంజ్ అధికారి జి ఉషారాణి పులి సంచరిస్తున్న ప్రాంతాన్ని సిబ్బందితో పర్యవేక్షించారు. పులి పాదముద్రలుగా గ్రామస్తుల చెపుతున్న వాటిని ఫారెస్ట్ అధికారులు మంగళవారం క్షుణ్ణంగా పరిశీలించారు. పాదముద్రలను కొలచి దర్యాప్తు ముమ్మరం చేశారు. చిరుతపులి మేకలమందపై దాడి చేసి రెండు మేకలు ఎత్తుకెళ్లిందని తాము చూసినట్లు స్థానికులు ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. ఈ నేపథ్యంలో గొబ్బలమడుగు, దోనెలపాలెం, కినపర్తి గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గొబ్బులమడుగు సమీపంలో కొండ వాగువద్ద కూడా పులి పాదముద్రలు కదలికలను చూసిన స్థానికులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. పులి సంచరిస్తున్నట్లు ఆనోటా, ఈనోటా చుట్టుపక్కల దావానంలా వ్యాపించడంతో ఆ రహదారి మీదుగా ప్రయాణించే వారు తీవ్రంగా భయపడుతున్నారు. పాదముద్రలు చిరుతపులివి అవి ఉండవచ్చునని భావిస్తున్నప్పటికీ దర్యాప్తనంతరం వెల్లడిస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

సీలేరులో వర్షం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో మంగళవారం వర్షం పడింది. ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపం చూపడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉష్ణోగ్రత అధికంగా ఉంది. అనంతరం మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. సాయంత్రం స్కూలు విడిచిపెట్టే సమయంలో వర్షం కురవడంతో విద్యార్థులు ఇబ్బందులు గురయ్యారు. వర్షం కారణంగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పంట పొలాల్లో కోసిన వరి పనులు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇన్‌ఛార్జి ఎంఇఒపై డిఇఒకు యుటిఎఫ్ ఫిర్యాదు

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం ఇన్‌ఛార్జి మండల విద్యాశాఖాధికారి వివి.లక్ష్మీనారాయణపై జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీకి యుటిఎఫ్ నాయకులు కన్నారావు, రాంబాబు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల పర్యటనకు వచ్చిన డిఇఒను మాంటిస్సోరీ పాఠశాలలో మంగళవారం కలిసి విన్నవించారు. కూనవరం మండల ఉపాధ్యాయుల వ్యక్తిగత బీమా పాలసీలకు సంబంధించిన డబ్బులు రూ.2,31,038లపై ఇంత వరకు న్యాయం జరగలేదని, వాటిని రికవరీ చేయాలని కోరారు. కూటూరు పాఠశాల నిధులు సివిల్ వర్క్స్ పేరుతో అదనంగా డ్రా చేయడం వల్ల ఆ పాఠశాలలోని స్కూల్ గ్రాంటు, యూనిఫాం గ్రాంట్, స్టిచ్చింగ్ గ్రాంట్ రూ.43,940 నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఎమ్ఈఓ తీర్మానంతో స్వాహా చేశారని విమర్శించారు. జిల్లా పరిషత్ కూనవరం కాంప్లెక్స్‌లో 2013-14 సంబంధించిన గ్రాంట్ టిఎల్ఎం మండల మేళా నిధులు రూ.10,000 డ్రా చేసి స్వాహా చేయడం జరిగిందని పేర్కొన్నారు. కూనవరం కాంప్లెక్స్ నందు జిరాక్స్ మిషన్, కెమెరాలు కొనుగోలు చేసి వాటిని తమ ఇంటి వద్ద సొంత అవసరాలకు వాడుకున్నారన్నారు. అక్రమ డిప్యూటేషన్ పేరుతో ఉపాధ్యాయుల నుండి లంచాలు ఆశించినట్లు రుజువైందని తెలిపారు.



డిఇఒ బ్రహ్మాజీకి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండలంలోని తూటంగి జియుపి పాఠశాలలో అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ ఆ గ్రామస్తులు మంగళవారం స్థానిక ఎంఈఓ ఎస్.సుందర్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ, ఈ పాఠశాలలో 115 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులే ఉన్నారన్నారు. విద్యార్థులకు సరిపడే ఉపాధ్యాయులు లేక పోవడంతో విద్యాబోధన చేయడంలో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారి స్పందించి అదనపు ఉపాధ్యాయుని నియమించాలని ఆయన కోరారు . ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


మాట్లాడుతున్న డిఎంహెచ్ ఒ డాక్టర్ జమాల్ బాషా

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: కేన్సర్ వ్యాధి నివారణకు ముందస్తుగా ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిఎంఅండ్ హెచ్ ఓ జమల్ బాషా చెప్పారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన సందర్శించి క్యాన్సర్ పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నివారణకు ప్రభుత్వం ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తుందన్నారు. ఇంటి వద్దకే 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఉచితంగా పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు పి రాంబాబు, అంబికా రమణి, ఎం పి హెచ్ ఇ ఓ సౌరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు మంజూరు


శంకుస్థాపన చేస్తున్న పీడీ,సర్పంచ్

ప్రజాశక్తి - హుకుంపేట:మండలంలోని తీగల వలస పంచాయతీ ఓలుబెడ్డ గ్రామం పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన ఇల్లులను గ్రౌండింగ్ మేళ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఓలుబెడ్డ గ్రామంలో 64 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు కావడంతో స్థానిక సర్పంచ్ కిల్లో బేసు ఆధ్వర్యంలో హౌసింగ్ శాఖ పిడి బాబు నాయక్ గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. అనంతరం హౌసింగ్ శాఖ పిడి మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణం చేపడితే దపదపాలుగా బిల్లులను చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ఏఈ ఈశ్వరి, గ్రామ పెద్దలు కిల్లో అర్జున్, డిఈ ఓ భాను ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-మోతుగూడెం : మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాలు సందర్భంగా వై.రామవరం మండలం, డొంకరాయి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ శివకుమార్, పోలీసు సిబ్బంది, సిఆర్పిఎఫ్ పోలీసులు మంగళవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మన్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ వాహనాలు తనిఖీ చేపట్టినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు

ప్రజాశక్తి-మోతుగూడెం : మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాలకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం పేరును చింతూరు, వై.రామవరం మండలాల్లో పలు చోట్ల వాల్ పోస్టర్లు అంటించారు. బొడ్డగండి పంచాయతీ డొంకరాయి చుట్టుపక్కల గ్రామాల్లో మావోయిస్టులు ఈ వాల్ పోస్టర్లలో 'అమాయక గిరిజనులను ఇన్ఫార్మర్ నెపంతో చంపుతున్నారు.' 'బస్సులను దహనం చేసి మాకు రవాణా సదుపాయం లేకుండా చేస్తున్నారు.' 'రోడ్లు వేస్తున్న యంత్రాలు కాల్చి, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్లు పేల్చి మమ్మల్ని అభివృద్ధికి దూరంగా బతకమంటున్నారు.' అందుకే గిరిజనులకు ఉపయోగపడని మావోయిస్టుల వారోత్సవాలు వద్దు అని పేర్కొన్నారు.

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన 'స్వచ్ఛ భారత్'

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వికాస్ పాండే ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామి, మారెమ్మ ఆలయాలకు వెళ్లే రహదారి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఒకచోటకు చేర్చి నిప్పు పెట్టారు. అనంతరం మెయిన్ డ్యాం చివర పరిసర ప్రాంతాల్లో మద్యం సీసాలు, చెత్తాచెదారాలు తొలగించి పరిశుభ్రపరిచారు. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ వికాస్ పాండే మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లోనూ, పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన సీలేరు మెయిన్ డ్యాం చివర పరిసర ప్రాంతాల్లోనూ చెత్తాచెదారం, సీసాలు పడవేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కూనవరం : సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన వేలేరుపాడులో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు గుజ్జా మోహన్‌రావు, కందుకూరి స్వర్ణ పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితుల ప్యాకేజీ, పునరావాసం, ప్రథమ ప్రాధాన్యత గ్రామాల జాబితాలో మరిన్ని గ్రామాలను చేర్చే అంశంపై రీ సర్వే చేసి నిర్వాసితులందరికీ త్వరగా ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ ఈ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఈ మేరకు కూనవరంలో సిపిఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంటూరు లెక్కలతో కాకుండా, 2022 గోదావరి వరదలకు ముంపునకు గురైన ప్రతి గ్రామాన్ని ప్రథమ ప్రాధాన్యత జాబితాలో చేర్చి తక్షణమే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ కూనవరం మండల కార్యదర్శి లంబు శ్రీనివాసరావు, నాయకులు జుతుక సూర్యచంద్రరావు, సురేష్, విఆర్ పురం మండల కార్యదర్శి కర్నాటి ఏసు, ఎటపాక మండల కార్యదర్శి వెలిశాల నాగరాజు, కంటే రాజు, గుంటుక కుసుమరాణి, చింతూరు నాయకులు ఎస్‌కె రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మారకుంటే శాఖాపరమైన చర్యలు

- రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ హెచ్చరిక
- రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ భూములకు రెవెన్యూ అధికారులు సంరక్షకులని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వపరమైన పౌర సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవిన్యూ అధికారుల పనితీరు మెరుగుపడాలన్నారు. పౌర సేవలు అందించడంలో జాప్యం జరగకూడదన్నారు. ప్రజలకు కావలసిన కుల ధ్రువీకరణ పత్రాలు, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు వేగంగా జారీ చేయాలని సూచించారు. మ్యుటేషన్ ప్రక్రియ పక్కగా జరగాలని తెలిపారు. మ్యుటేషన్లలో అక్రమాలకు అవినీతికి పాల్పడితే ఉద్యోగాలు తొలగిస్తామని హెచ్చరించారు. ఈనెల 5వ తేదీ నుండి జనవరి 8 వరకు జిల్లాలో రెవిన్యూ సదస్సులు నిర్వహించాలని చెప్పారు. రెవిన్యూ సదస్సులో సమస్యలను గుర్తించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవిన్యూ సదస్సు లపై ముందుగా షెడ్యూల్ ప్రకటించి ప్రజలను చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. 15 రోజుల్లో భూ అక్రములపై సర్వే పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం జరిగితే సంబంధిత భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ప్రభుత్వ భూములపై ఆడిట్ చేయాలని ఆదేశించారు. ఆక్రమణలపై తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు కలెక్టర్ వరకు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. రీసర్వే ప్రక్రియ ప్రారంభించాలని చెప్పారు.

జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ, మీకోసం (పి.జి.ఆర్.ఎస్) సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి తహసిల్దారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. సేవాపరమైన సమస్యలకు విఆర్వోలు బాధ్యత వహించాలాన్నారు. భూ వివాదాలు, సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. వీఆర్వోలు, తహసిల్దార్ కార్యాలయాల్లోనూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీలకు వచ్చినపుడు రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . మండల స్థాయిలో స్వీకరిస్తున్న ఫిర్యాదులను ఆన్లైన్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ పద్మలత, పాడేరు డివిజన్లోని తహసిల్దార్లు, పీఎంయు ప్రోగ్రాం అధికారి రాంగోపాల్, డిప్యూటీ తహసి ల్దారులు, ఆర్.ఐలు, సర్వే అధికారులు, పాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



డుంబ్రిగుడలో మాట్లాడుతున్న భాస్కరరావు



చింతూరులో బహుమతులు అందజేత



విఆర్.పురంలో నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా ఏఎంఓ ఐఈ కోఆర్డినేటర్ భాస్కరరావు మాట్లాడుతూ, దివ్యాంగుల పిల్లలను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్ సుందర్రావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ఐఇఆర్పిలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి:మండల విద్యాశాఖ అధికారి తాతబ్బాయి దొర ఆదేశాల మేరకు మండల ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ బొరగ త్రిత్వదాసు మాట్లాడుతూ వైకల్యం అనేది శారీరానికి కానీ మనసుకు కాదు, మన బుద్ధి దృఢ సంకల్పంతో ఉంటే వైకల్యం ఉన్నా సరే రాణించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఒక విద్యార్థినికి వీల్ చైర్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అందాల వీణాదేవి, జెడ్పి హైస్కూల్ హెచ్ఎం అన్నిగ నీలయ్య, ప్రత్యేక ఉపాధ్యాయుడు చిన్న బాబు, జోత్స్నా, వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీలోని ఏఎస్‌డిఎస్ కార్యాలయంలో ఏఎస్‌డిఎస్, శబరి వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దారు సరస్వతి, ఏఎస్‌డిఎస్ డైరెక్టర్ వి.గాంధీ బాబు, వికలాంగుల కోఆర్డినేటర్ నేరపెట్టి రవి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉలుమూరుకు చెందిన జాను బాబుకు ఎమ్మార్వో చేతుల మీదుగా రైల్వే పాస్, ఏజి కోడేరుకు చెందిన సేగ్గం రాములు, బీరబోయిన కాంతమ్మకు బస్సు పాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు సోయం నాగమణి, వికలాంగులు, ఏఎస్‌డిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : చింతూరులోని ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ సెంటర్ భవిత్ సెంటర్‌లో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పిల్లలకు స్వీట్, హాట్, స్నాక్స్, రగ్గులు, బహుమాతులు అందజేశారు. ఎండిఓ చైతన్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పండా కిష్టయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్యామ్ రాజు, శ్యాం సుందరబాబు, కే.జయక్ష్మీ, శారద వికలాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు
- ఉత్సాహంగా పార్టీ చింతూరు మండల మహాసభ


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - చింతూరు : పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సిపిఎం చింతూరు మండల 9వ మహాసభ మండలంలోని కల్లేరు గ్రామంలో అమరజీవి సోడే సుబ్బయ్య, కంగాల రంగయ్య నగర్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపు మండలాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. దశాబ్ద కాలంగా నిర్వాసితుల పక్షాన ఉండి పునరావాసం పరిహారంపై ఎర్రజెండా పార్టీ సిపిఎం పోరాడుతూనే ఉందని చెప్పారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఆనాడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సరైన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించకపోగా, నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ అందించడంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అనంతరం వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా నిర్వాసితుల పట్ల సరైన న్యాయం చేయకపోయిందన్నారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టే బహుళార్థక సాధక ప్రాజెక్టు నిర్మాణంపై రెండు ప్రాంతీయ పార్టీలు కేంద్రం నుండి నిధులు తెచ్చి నిర్వాసితులకు ఇవ్వాల్సింది పోయి అక్రమ వ్యాపారాలకు తెర లేపిందని విమర్శించారు.


అమరులకు నివాళ్లర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

నేడు కూటమి ప్రభుత్వం రూ.27 వేల కోట్లు కరెంటు చార్జీలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందన్నారు. అదానితో ఒప్పందం కుదుర్చుకొని రూ.8 లక్షల కోట్లు రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు. జిఓ 3ను పునరుద్ధరిస్తామని, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటిస్తామని ఎన్నికలకు ముందు అరకులో సభలో చెప్పిన చంద్రబాబు ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. కొమరం భీమ్ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో మన్య ప్రాంతంలో హక్కులకై పోరాటాలకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొలుత మహాసభ ప్రాంగణంలో అమరవీరుల చిత్రపటాలకు పలువురు నాయకులు పూల మాలలను వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అభ్యుదయ గేయాలను పిఎన్ఎమ్ బృందం ఆలపించింది. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సీసం సురేష్, విఆర్.పురం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, పార్టీ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, రంగమ్మ, మల్లం సుబ్బమ్మ, ఎంపీటీసీ ముర్రం లక్ష్మి, వేఖ రాజ్ కుమార్, పిఎన్ఎం కళాకారులు మొట్టం రాజయ్య, పత్రా రమేష్, చిన్నయ్య, కారం నాగేష్, కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి మరమ్మతులు

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని కన్నాయిగూడెం పంచాయతీ పరిధి ఫెర్గిషన్ పేట ప్రభుత్వ పాఠశాల భవనం ఫ్లోరింగ్ పలిగిపోగా, జమాల్ ఖాన్ చారిటుబుల్ ట్రస్టు రూ.25వేలుతో మరమ్మతులు చేసింది. పాఠశాల భవనం ఫ్లోరింగ్ పగిలిపోయి, గోతులు ఏర్పడడంతో క్రిమి కీటకాలు అందులో చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తమ జెకెసి ట్రస్టు తరుపున రూ.25వేలు ఖర్చు చేసి దెబ్బతిన్న ఫ్లోరింగ్‌ను సిమెంటు నాపరాళ్ళు కాంక్రీట్‌తో ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు జమాల్ ఖాన్‌ను తమ గ్రామానికి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మానే ప్రవీణ్, విద్యా కమిటీ చైర్మన్ నరేష్, సోడే రాజు, కుసుమ వెంకన్న బాబు, ట్రస్ట్ సభ్యులు జావేద్, సిబ్బంది రసూల్, విక్కీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగ ఆధారిత హింసపై పోరాటం

ప్రజాశక్తి-సీలేరు : బాల్య వివాహాలు, లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా పోరాడాలని మహిళా పోలీస్ కే నిర్మల పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం లక్కవరపుపేట పంచాయితీ గరికిబంద గ్రామంలో జాతీయస్థాయి బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివో ఎస్.నరసింహారావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు గ్రామాల్లో పర్యటించి ఆడపిల్లలకు విద్య ప్రాముఖ్యత గురించి విద్యార్థులు తల్లిదండ్రులు వివరించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం బాల్యవివాహాలు లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ రాజబాబు మహిళా పోలీస్ కే. నిర్మల అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గూడెం పాతవీధిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం గూడెం పాతవీధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం చేపట్టారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ పరమేశ్వరరావు పంటలకు వచ్చే తెగుళ్ల వాటి నివారణ చర్యలపై గిరి రైతులకి తెలియజేశారు. రబీ సీజన్ నుండి రాజ్మా పంటలకు రూ.300 చెల్లించి ప్రతి రైతు తప్పనిసరిగా క్రాప్ట్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కే. బలరాం, మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇన్సూరెన్స్ మండల కోఆర్డినేటర్ వినోద్, ఐసిఆర్‌పి సిబ్బంది రాంబాబు, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

వర్షంతో వాహనదారుల అవస్థలు


హెడ్‌లైట్ల వెలుతురులో వెళుతున్న వాహనాలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో కురుస్తున్న వర్షం కారణంగా స్థానిక ప్రజలు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా రాత్రి, పగలు కురుస్తున్న వర్షంతో వాహనదారులు లైట్లు వెలిగించి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అరకు, అనంతగిరి ప్రముఖ పర్యాటక కేంద్రాలు తిలపించేందుకు వచ్చిన పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ సేందడి చేశారు. అరకు ఘాట్ రోడ్, శివలింగపురం, డముకు, అనంతగిరి, సుంకరమెట్టలో వర్షంతో పాటు దట్టమైన పొగ మంచు కమ్మేయడంతో రాకపోకలు సాగించే వాహనాలు లైట్లు వెలిగించి వాహన ప్రయాణాలు కొనసాగించవలసిన పరిస్థితి నెలకొంది

సభ్యత్వాల పేరుతో ఆశా వర్కర్ల నుంచి వసూళ్లు

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు మండలంలో మినుములూరు పిహెచ్సిలో ఆశా కార్యకర్తలను బెదిరించి సభ్యత్వాల పేరుతో వేలాది రూపాయలు వసూళ్లు చేస్తున్నారని, వారిపై కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్పు చేస్తామంటూ రూ.5000 నుండి పదివేలు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని అన్నారు. పీహెచ్సీలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులే సభ్యత్వాల పేరుతో వసూలు చేస్తున్నారని తెలిపారు. కొంతమంది అధికారులు ఆశా కార్యకర్తలను భయపెట్టి డబ్బులు వసూలుకు పాల్పడుతున్నారని తెలిపారు.

పోలింగ్ రోజున ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక సిఎల్

ప్రజాశక్తి-పాడేరు : రంప చోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని ఉపాధ్యాయ ఓటర్‌లకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ రోజు ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను రాష్ట్ర ప్రధాని ఎన్నికల అధికారి మంజూరు చేశారని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు

శిక్షణకు వెళ్లిన రైతులు


శిక్షణకు వెళుతున్న రైతులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : నూతన వంగడాల ఉత్పత్తి శిక్షణకు ఇందిరాగాంధీ కృషి విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రాయ్పూర్, ఛత్తీష్‌గఢ్ రాష్ట్రాల్లో శిక్షణకు జిల్లా వనరుల కేంద్రం పాడేరు, ఏటీఎంఏ విశాఖపట్నం సౌజన్యంతో ముంచింగిపుట్టు, పెదబయలు మండలాల నుండి 17 మంది రైతులను వెళ్లినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యాన వన, చిరుధాన్యాల నాణ్యత, వంగడాల ఉత్పత్తులపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏటీఎంఏ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు విజయలక్ష్మి, లీలావతి పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం మంజూరు

ప్రజాశక్తి పాడేరు : జి మాడుగుల మండలం గ్రామంలో గ్యాస్ లీక్ ఇల్లు, ఇతర ఉపకరణాలు నష్టపోయిన బాధితులకు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ నష్టపరిహారం మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం చెక్కులను విడుదల చేశారు. సోమెల సింహాచలం, సోమెల భాస్కర్ రావుకు రు.25000 చొప్పున పరిహారాన్ని మంజూరు చేశారు. అదేవిధంగా బాధితులకు ఇల్లు మంజూరు చేయాలని గహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో 8,9 పదవ తరగతి విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్తియా కార్యక్రమం లో భాగంగా వైద్యులు నిఖిల్ వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి శంకర్‌రావు, ఎంపీ హెచ్ఈఓ వెంకటరావు వైస్ ప్రిన్సిపాల్ చిట్టిబాబు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

విఒఎలు విధుల బహిష్కరణ

- 17 నెలలు గౌరవ వేతనం బకాయిలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-దేవీపట్నం : 17 నెలలుగా బకాయి ఉన్న గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వెలుగు విఒఎలు మంగళవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. వారు నిర్వహించే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వర్కులను నిలుపుదల చేశారు. అనంతరం వెలుగు అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వివోఏల సంఘం మండల అధ్యక్షులు బి.నరసింహ మాట్లాడుతూ మండలంలోని పాముగండి క్లస్టర్‌లో ఐదుగురు వివోఏలకు, పోతవరం, దామనపల్లి, వి.రామన్నపాలెం గ్రామ సంఘాలలో కొంతమంది వివోఏలకు 17 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వలేదని తెలిపారు. దీనిపై అనేక సార్లు ఎంఎస్ ప్రతినిధులకు, ఏపిఎం అధికారులకు, హెచ్ఆర్ఐబి ఎపీడీకి విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో సిఐటియు పిలుపు మేరకు మండలంలోని ఏడు గ్రామ సంఘాల వివోఏలకు మద్దతుగా దేవీపట్నంలోని విఒఎలు అందరూ విధులను బహిష్కరించినట్లు చెప్పారు. ఏడు గ్రామాల సంఘాల వివోఏలకు 17 నెలల గౌరవ వేతనం చెల్లించే వరకు విధులకు హాజరయ్యేది లేదని స్పష్టం చేశారు. వేతనాల సమస్య పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఉన్న వివోఏలందరూ ఈ పోరాటంలో భాగస్వామ్యం అవుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సిహెచ్ సుధా, సహాయ కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, జి పోసివాణి, కె ప్రభాకర్, మండలంలోని వివోఏ పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎడిఎంహెచ్ఓ

ప్రజాశక్తి - దేవీపట్నం : మండలం పోతవరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ప్రాథమికోన్నత పాఠశాలను రంపచోడవరం అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ జి.శిరీష, ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు టి.డేవిడ్, ఎం సరస్వతి హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బందితో కలిసి మంగళవారం సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులను, స్నానపు గదులను, వంటగది, హాలు విద్యార్థులకు అందించే మెడికల్ కిట్ తదితరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అనారోగ్యం, జ్వరాలు వచ్చిన దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎడిఎంహెచ్ఓ శిరీష మాట్లాడుతూ పాఠశాలలో ప్రత్యేక హాస్టల్ వసతి లేకపోవడంతో తరగతి గదుల్లోనే విద్యార్థులు పడుకోవాల్సి వస్తోందని, బెడ్స్ సదుపాయం లేకపోవడం వల్ల నేల మీదే పడుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అరకొర సౌకర్యాలు మాత్రమే ఉండడంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని చెప్పారు. సుమారు 100 మంది విద్యార్థుల విద్యాభ్యాసం చేయుచున్నారని, ఇక్కడ హాస్టల్‌కు ప్రత్యేక గదులు, బెడ్స్ గాని లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యం గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ తాళ్లూరి డేవిడ్, డాక్టర్ ఎం సరస్వతి, ఎంపీహెచ్ఈఓ కోసు శ్రీనివాస్ దొర, పీటర్ హెచ్‌వి వసంత, రమణ, హెచ్ఎం కోసు వీరప్ప దొర పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఈనెల 5న జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని స్థానిక తాహాశీల్దార్ ఏ సత్యనారాయణ, సీఐ ఎన్ సన్యాసినాయుడు తదితరులు మంగళవారం పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాహాశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. వారి వెంట ఎస్బి హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తదితరులున్నారు.